# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  05-01-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఢిల్లీలో 12 వేల 200 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.

- భారతదేశాన్ని గర్వించదగ్గ  దేశంగా మార్చడానికి ప్రజలు, యువత ప్రాధమిక విలువలు అనుసరించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ పిలుపునిచ్చారు.

- పారాసిటమాల్ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని CISR అభివృద్ధి చేసిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు.

- ప్రయాగ్‌రాజ్ లో జరగనున్న మహా కుంభమేళా సందర్భంగా వచ్చే యాత్రికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే 13 వేల రైళ్లను నడపనుంది.

========================

ఢిల్లీలో 12 వేల 200 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ వరకు సుమారు 4 వేల 600 కోట్ల రూపాయల విలువైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ నమో భారత్ కారిడార్ 13 కిలోమీటర్ల మార్గాన్ని ఆయన ప్రారంభించారు. సాహిబాబాద్ ఆర్ఆర్టీఎస్ స్టేషన్ నుంచి న్యూ అశోక్ నగర్ ఆర్ఆర్టీఎస్ స్టేషన్ వరకు ప్రధానమంత్రి నమో భారత్ రైలులో ప్రయాణించి పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఢిల్లీలోని రోహిణిలో కేంద్ర ఆయుర్వేద పరిశోధన సంస్థ (సీఏఆర్ఐ) నూతన అత్యాధునిక భవనానికి నరేంద్ర మోడి శంకుస్థాపన చేశారు.

========================

పారాసిటమాల్ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా మండలి (CISR) అభివృద్ధి చేసిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రకటించారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా విభాగం వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్రమంత్రి ప్రసంగించారు. నొప్పి నివారణ, జ్వరాన్ని తగ్గించే ఔషధం పారాసిటమాల్ తయారీలో భారత్ స్వయం

సమృద్ధి సాధించడం ద్వారా దిగుమతి చేసుకుంటున్న పదార్థాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ ఆవిష్కరణ లక్ష్యమని పేర్కొన్నారు.

=======================

ఢిల్లీలో భద్రత, ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి కార్యక్రమాల కోసం గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం 75 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. ఈ రోజు ఢిల్లీ - రోహిణిలోని జపనీస్ పార్కులో ఏర్పాటు చేసిన ర్యాలీలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ దేశ రాజధానిగా ఢిల్లీని అభివృద్ధి చేయాలని ఉద్ఘాటించారు. భారతదేశపు గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబించే రాజధానిగా ఢిల్లీని మార్చడమే లక్ష్యమని, అదే సమయంలో మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా అంతర్జాతీయ సమాజానికి కేంద్రంగా కూడా ఢిల్లీ పని చేస్తుందని నరేంద్ర మోడీ చెప్పారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచే పట్టణాభివృద్ధి నమూనా ఢిల్లీకి అవసరమని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

ప్రతి ఒక్కరూ శారీరిక ధృడత్వాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు. ఈ రోజు గుజరాత్ లోని "ఫిట్ ఇండియా" ఉద్యమంలో భాగంగా నిర్వహించిన "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. స్థానికులతో కలిసి పోర్ బందర్ లోని ఉప్లేటా ప్రాంతంలో సైకిల్ యాత్ర చేశారు. శారీరిక ధృడత్వాన్ని, సుస్థిరతను పెంచేందుకు ఆదివారం సైకిల్ తొక్కడానికి ప్రజలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి మాండవీయ తెలిపారు. కాగా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మై భారత్ సహకారంతో గత నెలలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని ప్రారంభించింది.

=======================

చైనాలో వెలుగు చూసిన హెచ్ఎంపివి వైరస్ ను పరీక్షించే ప్రయోగశాలల సంఖ్యను భారత వైద్య పరిశోధన మండలి పెంచుతున్నదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత కొన్ని వారాలుగా చైనాలో హెచ్ఎంపీ వైరస్ వ్యాప్తిని నిశితంగా పరిశీలిస్తున్నామని, సంవత్సరం పొడవునా అప్రమత్తంగా ఉంటామని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇదిలా ఉండగా తాజా పరిణామాలపై ఢిల్లీలో జాతీయ ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశాన్ని ఈ రోజు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు. సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ వైరస్లు ఇప్పటికే భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా చలామణిలో ఉన్నాయని జాయింట్ మానిటరింగ్ గ్రూప్ గుర్తించింది.

విరామం

=======================

మహా కుంభమేళాలో భక్తుల భద్రత దృష్ట్యా గంగా, యమునా నదుల్లో పెద్ద సంఖ్యలో "జల్ పోలీసుల"ను మోహరించారు. నదులలో భక్తులకు ప్రమాదం కలుగుకుండా భాధ్యతలు నిర్వహించే ఈ సిబ్బందికి అండర్ వాటర్ డ్రోన్లు, సోనార్ సిస్టమ్స్ వంటి అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచారు. నదుల సంగంలోని ప్రతి అంగుళాన్ని జల పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. భక్తుల భద్రత కోసం జల్ పోలీసులు ఇప్పటివరకు 2 వేల 500 మంది సిబ్బందిని నియమించారు. మూడు జల్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జల్ పోలీసుల కంట్రోల్ రూమ్ నుంచి భద్రతను పర్యవేక్షిస్తుండగా, మొత్తంగా 17 జల్ పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు. జాతర ప్రారంభానికి ముందు

ఈ సిబ్బందిని మరింత పెంచి, మరో 1,300 మంది జల్ పోలీసు సిబ్బందిని నియమించనున్నారు. 8 కిలోమీటర్ల పరిధిలో నీటి లోతుల్లో బారికేడింగ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెండు రెస్క్యూ స్టేషన్లను ఏర్పాటు చేసి.. సిబ్బందిని మోహరించారు. అత్యవసర పరిస్థితుల్లో నాలుగు వాటర్ అంబులెన్సులు సిద్ధంగా ఉంచారు.

========================

భారతదేశాన్ని గర్వించదగ్గ  దేశంగా మార్చడానికి ప్రజలు, యువత మూల విలువులు అనుసరించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ పిలుపునిచ్చారు. ఈ రోజు ఢిల్లీలో ఎన్.సి.సి. రిపబ్లిక్ డే క్యాంప్ 2025 ను ఉపరాష్ట్రపతి ప్రారంభించి ప్రసంగించారు. సామాజిక సామరస్యం, దేశభక్తి విలువలను అలవరచుకోవడం, పర్యావరణ అవగాహన, స్వావలంబన, పౌర విధులు అనే 5 అంశాలపై దేశ పరివర్తన ఆధారపడి ఉందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. జాతీయత పట్ల పౌరులు చిత్తశుద్ధితో ఉంటే తప్ప ఏ దేశమూ ఎదగదని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

ప్రయాగ్‌రాజ్ లో జరగనున్న మహా కుంభమేళా 2025 సందర్భంగా భారీ సంఖ్యలో వచ్చే యాత్రికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే 13 వేల రైళ్లను నడపనుంది. వీటిలో 10 వేలు రెగ్యులర్ రైళ్లు, 3 వేలు ప్రత్యేక రైళ్లు ఉన్నాయి. ఈ రైళ్లు 50 రోజుల పాటు నడవనున్నాయి. ఇందులో కుంభమేళా ముందు, తరువాత 2 నుండి 3 రోజులు అదనంగా ఉంటాయి. ఈ మేరకు ఈ రోజు ఉత్తర మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శశికాంత్ త్రిపాఠి మాట్లాడుతూ... యాత్రికులకు సున్నితమైన, సురక్షితమైన అనుభవాన్ని అందించడానికి రైల్వే ఒక ప్రణాళికను రూపొందించిందని చెప్పారు. లక్షలాది మంది భక్తులు, సందర్శకులకు నిరంతరాయంగా సమాచార, రవాణా, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, రైల్వే అధికారులు కలిసి పని చేస్తున్నారని  పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రయాగ్ రాజ్ లోని గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద మహా కుంభమేళా జరగనుంది. వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ఆకర్షణలతో ఈ కుంభమేళా ఘనంగా నిర్వహించానున్నారు.

========================

గుజరాత్ లోని పోర్ బందర్ విమానాశ్రయంలో ఈ రోజు కోస్ట్ గార్డ్ అడ్వాన్స్ డ్ లైట్ హెలికాప్టర్ కూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ప్రాధమిక సమాచారం ప్రకారం, నిరంతర శిక్షణ కార్యక్రమాల సమయంలో ఈ విషాద సంఘటన జరిగింది. ఈ హెలికాప్టర్ ప్రయాణం మొదలు పెట్టాక,  సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్న కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంపై కోస్టుగార్డు దర్యాప్తు చేపట్టింది.

========================
========================